క్లుప్తంగా

సెకండ్ ఇంటర్ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.డి.ఎల్ కుమారి చెప్పారు. పరవాడ, అచ్యుతాపురం, తానాం, ఇస్తాంపేట కళాశాలల నుంచి 422 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 411 మంది పరీక్షలు రాశారని ఆమె చెప్పారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించింది. సీఐ పి.ఈశ్వరరావు పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

అందుబాటులో కాకిజొన్న విత్తనాలు

సబ్బవరం: పాడిరైతులకు 75 శాతం రాయితీపై కాకిజొన్న విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు సబ్బవరం ప్రాంతీయ పశువైద్య కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఉషా కుమారి తెలిపారు. మండలంలో 2,100 కిలోల విత్తనాలు పాడి రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రూ.460 విలువ చేసే 5 కిలోల కాకిజొన్న విత్తనాలు రాయితీపై రూ.115 కే అందించనున్నట్లు చెప్పారు.విత్తనాలు కావాల్సిన పాడి రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో లేదా పశు వైద్య కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. రైతుల ఆధార్ నంబర్‌తో పాటు ఫోన్ నంబర్‌ను తెచ్చుకోవాలని సూచించారు.

యల్లమ్మా.. చల్లగ చూడమ్మా


వడ్డన చేస్తున్న శ్రీనుబాబు తదితరులు


సింహాచలం: అడవివరం శివారు సిడగంపేటలో కొలువుదీరిన యల్లమ్మతల్లి పండగను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


పెందుర్తిశాఖ మేనేజర్ మిశ్రాను అభినందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు

సింహాచలం: యూనియన్ బ్యాంక్ కల్పిస్తున్న సౌకర్యాలను ఖాతాదారులంతా సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎంలు మూర్తి, తిలక్ సూచించారు. పెందుర్తి యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో గురువారం రిటైల్ ఎంఎస్ఎంఈ రుణ సమావేశం నిర్వహించారు. ఏజీఎంలు మాట్లాడుతూ ఖాతాదారుల కోసం అనేక సౌకర్యాలు యూనియన్ బ్యాంక్‌ల్లో అందిస్తున్నామన్నారు. తక్కువ వడ్డీకే రుణసదుపాయం కల్పించడం జరుగుతోందన్నారు. ఈసందర్భంగా పదకొండు కోట్లు రుణాన్ని మంజూరు చేశారు. వందమంది ఖాతాదారులు, పెందుర్తి చుట్టుపక్కల ఉన్న పన్నెండు బ్రాంచ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రమేష్, పెందుర్తిశాఖ బ్రాంచి మేనేజర్ జె.కె.మిశ్రా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మిశ్రాకు ఖాతాదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఏఎస్ఈకి యూబీఏ నిధుల మంజూరు


యూబీఏ నిధులు స్వీకరిస్తున్న ఆచార్య టి.శోభశ్రీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)కి ఉన్నత్ భారత్ అభియాన్(యూబీఏ)లో భాగంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూ. 50 వేలు సీడ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు గురువారం ఈ నిధులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అందుకున్నారు.

మలుపుల మాటున ముప్పు!


ముత్యాలమ్మపాలెం రహదారిలో ప్రమాదకరమైన మలుపు


ముత్యాలమ్మపాలెం రహదారిలో సిమ్మన్నగారిదొడ్డి వద్ద ప్రమాదకరమైన మలుపు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- స్పందించని అధికారులు

పరవాడ: మండలంలోని పలు రహదారుల్లో మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అతిదగ్గర మలుపులు కావడం, ఇరువైపులా తుప్పలు పెరగడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలను గుర్తించకలేక ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. మలుపుల వద్ద తుప్పలు తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదకరమైన మలుపులను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ఆర్ అండ్ బీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. అధికారులు మలుపులను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


తిక్కవానిపాలెం రహదారిలో ప్రమాదకరమైన మలుపు


పి.భోనంగి రహదారిలో ప్రమాదకరమైన మలుపు

- పరవాడ పోలీసు స్టేషన్ మలుపు వద్ద వాహనాలు ఢీ కొట్టుకొన్న ఘటనల్లో పలువురు మృత్యువాత పడ్డారు. అయినా ఇంత వరకు ఆ మలుపులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు.
- లంకెలపాలెం-అనకపల్లి రహదారిలో పెదముషిడివాడ వద్ద ప్రమాదకరమైన మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలోని ప్రమాదకర మలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో క్షత గాత్రులవుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్నవి కొన్ని మాత్రమే.
- వాడచీపురుపల్లి-తిక్కవానిపాలెం రహదారిలో ఊటగెడ్డపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని మలుపు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. తిక్కవానిపాలెం బీచ్‌కు వస్తున్న పర్యాటకులు మలుపు వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు.
- జాజులవానిపాలెం-పి.బోనంగి, పరవాడ-భర్నికం, తానాం-పరవాడ, వాడచీపురుపల్లి-తంతడి రహదారుల్లోని మలుపులు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

సబ్బవరంలో నిలిచిన ఏపీ ఫైబర్ గ్రిడ్ సేవలు

సబ్బవరం: సబ్బవరం మండలంలో ఆంధ్రప్రదేశ్ ఫైబర్ గ్రిడ్ సేవలు నిలిచిపోవడంతో కేబుల్ టీవీ ప్రసారాలు లేక టీవీలు మూగబోయాయి. సబ్బవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ గ్రిడ్ కంట్రోల్ రూమ్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.దీంతో కంట్రోల్ రూమ్‌లోని ఏపీ ఫైబర్ ఎలక్ట్రానిక్ డివైజ్‌లు దెబ్బతినడంతో పాటు ఓఎల్టీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాల్లో తరుచూ అంతరాయంతో పాటు హై ఓల్టేజ్ సమస్యతో కంట్రోల్ రూమ్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో ప్రసారాలు నిలిచిపోయాయి. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు తలెత్తిన సమస్యపై ఏపీ ఫైబర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించినప్పటికీ గురువారం రాత్రి కావచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు ఈ కంట్రోల్ రూమ్ కోటపాడు సెక్షన్ కంట్రోల్‌లో ఉండడంతో తరుచూ ఈ సమస్య తలెత్తున్నట్లు సిబ్బందితో పాటు స్థానిక ఆపరేటర్లు చెప్పుకొస్తున్నారు. దీంతో సబ్బవరంలో సుమారు 1,500 మందికి పైగా కేబుల్ టీవీ వినియోగదారులతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు బుధవారం నుంచి ప్రసారాలు నిలిచిపోయాయి.

ఏపీ ఫైబర్ లోగో

టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి శర్మ

డాబాగార్డెన్స్: ఈ నెల 20 నుంచి 27 వరకు జమ్మూకశ్మీర్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి డీవీఎస్‌వై శర్మని టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియమించింది. శర్మ ఇటీవల గోవాలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో, కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లో జరిగిన నేషనల్ రిఫరీ కోర్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి. సుధాకరబాబు, మేనేజర్ (పర్సనల్) భగవాన్‌ప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ఎల్ఐసీ స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సభ్యులు అభినందించారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్ర తదితరులు

సింహాచలం: గ్లకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి గ్లకోమా సీనియర్ స్పెషలిస్టు డాక్టర్ టి.రవీంద్ర తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్లకోమా పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ టి.రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును అపహరించే వ్యాధి అని తెలియజేశారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుని తగిన సమయంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోగులకు గ్లకోమా వ్యాధిపై చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు.కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మురళీనగర్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మురళీనగర్ రామాలయంలో ఈ నెల 22 నుంచి 30 వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీతారాముల ఆలయ అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు స్వామికి వివిధ రకాల పుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు అష్టోత్తర నామార్చన ఉంటుంది. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు నీరాటోత్సవం నిర్వహించి సీతారాములను పెండ్లి కుమార్తె, కుమారులుగా అలంకరించి అర్చనాదికములు జరుపుతారు. ఈ నెల 30న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6 గంటలకు పట్టాభిషేకం దర్బార్ సేవ, పవళింపు సేవలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 2న అన్నదానం జరుగుతుంది.


శ్రీరామ నవమి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి, వరప్రసాద్

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.36 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్ట శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు వి.వసంత కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 21 రోజులకు రూ.16.36 లక్షల నగదు, 25.700 మిల్లీగ్రాముల బంగారం, 133 గ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన డాలర్లు వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు, భక్తులు, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి


ఫుట్‌పాత్ ఆక్రమణలపై అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగరంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కమిషనర్ గురువారం చినవాల్తేర్ నుంచి అప్పుఘర్ వరకు నడక మార్గాన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై చాలా వరకు ఆక్రమణలు ఉన్నాయని, కార్ల సర్వీసింగ్ సెంటర్ వద్ద చాలా వరకు ఫుట్‌పాత్‌లపై దుకాణాల వంటివి పెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ పోల్స్‌కు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించి కట్టాలని, అనవసర కేబుల్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు. పలు చోట్ల మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించేలా ఆ స్థల యజమానులకు తెలిపి, వారిచే శుభ్రం చేయించాలన్నారు. ప్రధాన రోడ్లకు కనెక్ట్ అవుతున్న అప్రోచ్ రోడ్ల మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయంగా కనిపించేలా చూడాలన్నారు. రేసపువానిపాలెం గణేష్‌నగర్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆ స్థల యజమానులచే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పారిశుధ్యం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ ఇంకా మెరుగ్గా ఉండేలా చూడాలని, సెంట్రల్ మీడియంలో ఆకర్షణీయంగా ప్లాంటేషన్ పచ్చగా కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని, రాత్రిపూట పశువుల సంచారం లేకుండా చూడాలని ఆదేశించారు. సైడ్ మీడియన్లలో భవన నిర్మాణ వ్యర్థాలు కనిపిస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీసీపీ సంజయ్ రత్నకుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) లక్ష్మోజీ, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌డీసీ బృందం ఐఐపీఈ సందర్శన


ఐఐపీఈ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)ని గురువారం నేషనల్ డిఫెన్స్ కాలేజ్ నుంచి మేజర్ రాజేష్ అరుణ్ మోఘతో కూడిన నిపుణుల బృందం సందర్శించింది. ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ తమ సంస్థలో జరుగుతున్న పరిశోధన సంబంధ అంశాలను వివరించారు. దేశ ఇంధన అవసరాలు, భద్రతకు చేస్తున్న కృషిని పరిశోధన విభాగం డీన్ ఆచార్య కె.విజయ్‌కుమార్ తెలియజేశారు. బయో ఫ్యూయల్స్, బ్యాటరీస్, కార్బన్‌కాప్చర్, సీక్వెస్టరింగ్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సౌర విద్యుత్, వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి, పవన విద్యుత్, జియో థర్మల్ ఎనర్జీ తదితర రంగాలపై చర్చించారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.
ఘనంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమంపడంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు,ప్రసాదం అందజేశారు.


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు


స్వర్ణపుష్పాలు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో అప్పలరాజు తదితరులు


పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడని కొనియాడారు. మహాత్మాగాంధీ చూపిన సత్యం,అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. రాధాకుమారి, పీవీ భాస్కరరావు, జి. శ్రీరామమూర్తి, జి. గురునాథరావు, సీహెచ్ కుమార్,ప్రకాష్ పాల్గొన్నారు.

సింహాచలం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పెందుర్తిశాఖ గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆంధ్రులంతా ఎంతగానో గర్వించదగ్గ వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకిరామ్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం వచ్చే వరకు మనరాష్ట్రం మద్రాస్‌రాష్ట్రంలో కలిసి ఉండేదని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తెలుగుకు ప్రాధాన్యత లేదన్నారు. పొట్టిశ్రీరాముల త్యాగఫలమే ఆంధ్రరాష్ట్రం అవతరణ అని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష

మహారాణిపేట : కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు, 55 సంవత్సరాలు దాటిన పురుషులకు ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ రెండు రోజుల పాటు 242 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతో పాటు ఎక్కువ దూరం నడవలేరని అన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతో పాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని తెలిపారు.


సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 763వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఎంఎంఎస్ఎం మరియు ఎస్టీఎం కార్మికులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి, ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, ఇది దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్మిక హక్కులు అమలవ్వాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. ఈ వారాంతానికి పోరాట కమిటీ సభ్యులంతా ఢిల్లీ వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

మంత్రి మూర్తి సేవలు మరువలేం

మేయర్ హరివెంకటకుమారి

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకునిగా మంత్రి మూర్తి అందించిన సేవలు మరువలేమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. నడుపూరులోని ఆయన నివాసంలో మంత్రి రాజశేఖర్, శంకర నారాయణ ఆధ్వర్యంలో గురువారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి చిత్రపటానికి మేయర్ హరివెంకటకుమారి దంపతులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, గొలగాని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్మిక సంఘ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, గొందేశి సత్యారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొని, సంతాపం వ్యక్తం చేశారు.


మూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి